1. 19/8/2015 నాడు అధ్యయనం తెలుగు కళా సాంస్కృతిక సాహిత్య చర్చావేదిక “తెలుగు సాహిత్యం పరిశోధన కొత్తకోణాలు” అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆచార్య జయధీర్ తిరుమల రావు గారు ప్రసంగించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య తుమ్మల రామకృష్ణగారు వ్యవహరించారు. ఈ సభకు అధ్యయనం అధ్యక్షుడు, పిహెచ్.డి పరిశోధక విద్యార్థి గరిగె రాజేష్ అధ్యక్షత వహించారు.

ఈ సమావేశానికి సమన్వయ కర్తగా వ్యవహరించిన ఆచార్య తుమ్మల రామకృష్ణగారు మాట్లాడుతూ తెలుగు భాషను అధ్యయనం చేస్తున్న విద్యార్థులగా ఇటువంటి సంస్థలను నెలకొల్పి సాహిత్య కృషి చేయడం హర్షనీయమన్నారు. పరిశోధన రంగంలో రావాల్సిన మార్పుల గురించి విశదీకరించారు. తెలుగు పరిశోధనలు జరిగిన తీరుతెన్నులను సూచించారు. విద్యార్థి దశలో ఉన్న సమయంలో తను స్వయంగా నెలకొల్పిన, పనిచేసిన సాహితీసంస్థలను ఈ సందర్భంగా గుర్తుచేసారు.

ఈ సమావేశంలో ఆచార్య జయధీర్ తిరుమలరావుగారు “తెలుగు సాహిత్యం పరిశోధన–కొత్తకోణాలు” అనే అంశంపై ప్రసంగించారు.

నేటి కాలంలో సమాజాన్ని అస్థిత్వ భావనలు నడిపిస్తున్నాయి. వాటి వక్తీకరణగానే సాహిత్యం కూడా ఉంటూ వస్తోందన్నారు. ముఖ్యంగా కుల సాహిత్యం ప్రధాన స్రవంతిగా ఉంటోందన్నారు.

నేటి పరిశోధనల్లో నవ్యత లోపించి ఒక యాంత్రకత చోటుచేసుకుంటోంది. ఈ యాంత్రికతను నేటి పరిశోధనలు బద్ధలుకొట్టినప్పుడే సమాజానికి మార్గదర్శకమవుతాయన్నారు.

పరిశోధనల్లో లోపిస్తున్న శాస్త్రీయ దృక్పథాల ప్రాముఖ్యాన్ని ఆయన నొక్కిచెప్పారు. ఈ దృక్పథంలో నేటి అస్తిత్వ సాహిత్యాన్ని పరిశోధించాలని ప్రతిపాదించారు.

నేటి పరిశోధనలు ఎక్కువగా లైబ్రరీలకు, టేబుళ్ళకు పరిమితమై రచింపబడుతున్నాయి. ఈ పద్ధతితోపాటు క్షేత్రపర్యటనలో సేకరించిన, ముఖ్యంగా జానపద సాహిత్యంపై పరిశోధనలు ఆధునిక దృక్పథంలో జరగాల్సిన అవసరం నేటి సమాజానికి ఎంతో ముఖ్యమన్నారు.

నేటి పరిశోధనలో పొగడ్తలకు ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు. పరిశోధనలో విమర్శ రోజు రోజుకూ మందగిస్తుందన్నారు.

తదనంతరం జరిగిన విద్యార్థుల అడిగే ప్రశ్నలకు సమాధానాలను ఇచ్చారు.

2. 26/8/2015 నాడు అధ్యయనం నిర్వహించిన కవిత్వ వర్క్ షాప్‌కి సీతారం గారిని ముఖ్య వక్తగా, కవిత్వ శిక్షణశాల నిర్వాహకులుగా ఆహ్వానించింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా పరిశోధక విద్యార్థి భారతి, ముఖ్య అతిథిగా తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య తుమ్మల రామకృష్ణ గారు వచ్చారు. ప్రారంభ ఉపన్యాసకులు అయినటువంటి డా. పిల్లలమర్రి రాములుగారు మాట్లాడుతూ “ఇలా రకరకాలైన కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల తరగతి గదులకు సంబంధించిన పాఠాలే కాకుండా మీమీ ప్రతిభల్ని ప్రదర్శించడానికి ఇవి వేదిక అవుతాయి. విద్యార్థులతో పాటు విద్యార్థినిలు కూడా ముందుకు రావాలన్నారు. ఈ సభకి భారతిని అధ్యక్షతగ పెట్టి గౌరవస్థానం కల్పించినందుకు అభినందనలు. కవిత్వం పూర్వకాలంలో ఋషి మాత్రమే రాయగలడు అని అన్నారు. కాని

బోయవాడైన వాల్మీకి రామాయణం రాశాడు. కనుక ఆనాడే ఋషి కానివాడు కూడా కవిత్వం రాయగలడని వాల్మీకి తెలియజెప్పాడని అన్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య తుమ్మల రామకృష్ణగారు మాట్లాడుతూ – కవిత్వమనేది హృదయానికి సంబంధించిన ఒక అభివ్యక్తని, నువ్వు హృదయంతో మాట్లాడాలని, మనసుతో మాట్లాడాలని కానీ నోటితో కాదన్నారు. ఏది చెప్పిన నీలోంచి చించుకొని రావాలన్నారు. ఎవరైతే మనకు ఒక మంట పుట్టించి, ఒక నిప్పుల కొలిమిగా, ఒక కత్తుల్ల మాటలు విసిరారో, ఒక మంటల్ల, ఒక ఉప్పెనల రాసారో వాళ్ళనే మనం గుర్తుపెట్టుకుంటామన్నారు.

దుఖానికి, కన్నీళ్లకి ఓ పరిభాష ఇస్తే అది కవిత్వమవుతుందని, కవిత్వం నేర్పితే రాదు నీ ఆ తపన పుట్టాలి, అదొక మంట నీలోంచి రావాలి అని అన్నారు.

ఈ కార్యక్రమం ముఖ్యంగా కవిత్వ ఎలా రాయాలి? ఏ విధంగా రాయాలి? అన్న అంశాలను ప్రధానంగా చేసుకొని సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా వచ్చిన సీతారం గారు మాట్లాడుతూ – కవిత్వం రాయడం నాక్కూడా తెలియదని, రాస్తూ రాస్తూ ఉంటే రాయడం, వింటూ వింటూపోతే వినడం తెలుస్తుందన్నారు. గోరెటి వెంకన్న ‘సంచారమే ఎంతో బాగున్నది దానంత ఆనందమేమున్నది’ అనే పాటను ఉదహరిస్తూ సమాజం అంతటికి సంపదే ఎంతో బాగుంటే, వెంకన్నకు మాత్రం సంచారమే ఎంతో బాగుందన్నారు. మనిషిని మనిషితో కలిపి కుట్టే కన్నీటి దారమే కవుత్వమనీ, కవిత్వమంటే భూమితో సంభాషణ, ఆకాశంతో స్నేహమని అన్నారు. ఊరు నుంచి ఆడిటోరియానికి రావడానికి బాధపడలేదని, జీవితంలో ఇంత స్థాయికి రావడానికి బాధపడ్డానని తెలియజేశారు.

మానేడు, సోలేడు, తవ్వేడు, బండెడె ఇలా కాక కవిత్వాన్ని గుండెతో కొలవమన్నారు. కవిత్వం ఒక ఆసరా, కవిత్వం ఒక కవచకుండలం, కవిత్వం ఒక ఆయుధం, కవిత్వం ఒక జీవితం, కవిత్వం ఒక ఆవేశం, కవిత్వం రాజకీయ నిబద్ధతన్నారు. మార్కులు మూర్ఖులకు కూడా వస్తాయి కాని కవిత్వం జ్ఞానమున్నవాడికి వస్తుంది, చైతన్యం ఉన్నవాడికి వస్తుంది, జీవితం ఉన్నవాడికి వస్తుందన్నారు.

కేవలం ఈ కార్యక్రమమంలో సీతారం గారు ఉపన్యాసంల మాట్లాడడం కాకుండ విద్యార్థులచేత కవిత్వం రాయించారు, రాసింది చదివిపించారు. కొన్ని కవితా పాదాలను ముద్రించి, ఆయన స్వంతంగా తయారు చేసిన అట్టముక్కలను అధ్యయనం కార్యకర్తలకు ఇచ్చారు. వెళ్తూ వెళ్తూ మన విద్యార్థులు ఈ కార్యక్రమం తరువాతైనా కవిత్వం అర్థంచేసుకోడం, రాయడం ప్రారంభిస్తే నా ఈ ప్రసంగానికి, మీరు నిర్వహించిన ఈ కార్యశాలకు గిట్టుబాటు అయినట్టు అని అన్నారు.

3. 23/9/2016 నాడు అధ్యయనం నెట్(జె.ఆర్.ఎఫ్) మొదటి పేపర్ పై విద్యార్థులకు అవగాహనను కల్గించటనికి నిర్వహించిన కార్యక్రమంలో ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్ గారు ప్రసంగించారు. ఆయన కొన్ని సంవత్సరాలుగా ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలనుంచి వచ్చిన విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని ఇంగ్లీష్ లో ఉన్న నెట్ మొదటి పేపర్పై తరగతులు నిర్వహిస్తున్నారు.

ఈ కార్యక్రమంలో ఆయన నెట్ మొదటి పేపర్ లో వస్తోన్న Teaching aptitude, Research aptitude, coding de coading, blood relations, Data interpatation మొదలైన అనేక విభాగాలను ఉదాహరణలతో సహా వివరించారు.

ముఖ్యంగా పై అంశాలను ఎక్కువకాలం గుర్తుపెట్టుకోవడానికి వీలుగా ఉండే అనేక మెళకువలను సృజనాత్మకంగా విద్యార్థులకు అందించారు. విద్యార్థులు అడిగిన అనేక సమస్యలకు ఆయన బోర్డ్ పై రాసి సమాధానాలు చెప్పారు.

4. 7/9/2016 నాడు అధ్యయనం సాహిత్యం–తత్వశాస్త్రం' అనే అంశంపై నిర్చహించిన కార్యక్రమంలో

ప్రొ.ఆడ్లూరి రఘురామరాజు గారు ప్రసంగించారు. ప్రొ.గడ్ల అరుణకుమారి గారు సమన్వయ కర్తగా వ్యవహరించారు. ఈ సభకు పిహెచ్.డి పరిశోధక విద్యార్థి అరుణ గారు అధ్యక్షత వహించారు.

ఈ సభకు సమన్వయ కర్తగా వ్యవహరించిన ప్రొ.గడ్ల అరుణకుమారి గారు సాహిత్యం–తత్త్వశాస్త్రాల మధ్యగల పరస్పర సంబంధాలను గూర్చి చర్చించారు. తెలుగు సాహిత్యంలో నెలకొన్న అనేక తాత్త్విక సంప్రదాయాలను పరామర్శించారు.

ప్రొ. అడ్లూరి రఘురామరాజుగారు చలం సాహిత్యంలోని తాత్త్వికతను ఆవిష్కరించారు. తెలుగు సాహిత్యంలో తాత్త్విక దృష్టితో వెలువడిన అసమర్థుని జీవయాత్ర, అల్పజీవి, చివరకు మిగిలేది' మొదలైన నవలల్లోని తాత్వికతను స్థూలంగా ప్రస్థావించారు. తదనంతరం విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

5. అధ్యయనం తెలుగు కళాసాంస్కృతిక సాహిత్య చర్చా వేదిక "పరిశోధన పత్రరచన: మెళకులు" నిర్వహించిన కార్యక్రమానికి పిహెచ్.డి పరిశోధక విద్యార్థి చంద్రయ్య అధ్యక్షత వహించారు. డా. దార్లవెంకటేశ్వరరావుగారు పరిశోధన పత్రరచన: మెళకులు అనే అంశంపై ప్రసంగించారు. చేసిన ప్రసంగం నుంచి కొన్ని ముఖ్యమైన అంశాలు.

1. పరిశోధ పత్రం ఎవరి కోసం అనే శీర్షికలో పరిశోన పత్రాన్ని ఎలా రాయాలి?, దానిలో ఏయే అంశాలుండాలనే విషయాలను స్థూలంగా వివరించారు.
2. ''Research'' అనే పదానికి నిఘంటువుల్లో ఉన్న అర్థాలను పేర్కొంటూ... *బ్రౌణ్య తెలుగు –ఇంగ్లీష్* నిఘంటువు, *శ్రీ హరి* నిఘంటువు మొదలైన ప్రదాన నిఘంటువల్లో ఉన్న అర్థాలను సూచించారు.
3. పరిశోధన, సమీక్ష, విమర్శ అనే అంశాల మధ్య ఉన్న తేడాలను తెలియజేస్తూ. జయప్రకాశ్ గారు రాసిన *పరిశోధన విధానం*, *జి. వి. ఎస్. వ్యాసాలు* అనే పుస్తకాలను ఉదాహరణలుగా చూపించారు.

4. పరిశోధన పత్ర స్వరూపంలో ఉండవలసిన ఆధారాల వివరాలను ఏయే సందర్భాల్లో ఎలా ఇస్తున్నారో అనే అంశాల్ని వివరిస్తూ, ఆధార గ్రంథాల ఆవశ్యకతను తెలిపారు.
5. పరిశోధన పత్ర సాధారణ నియమాలను గురించి వివరిస్తూ, అందులో పాఠించవలసిన ఫాంట్లు, సాఫ్ట్ వేర్ ల వివరాలను తెలియజేశారు. అంతే కాకుండా సభ, సమావేశాలు (సెమినార్స్, మీటింగ్స్) నిర్వహించే వారి కర పత్రంలో ఉన్న సూచనలకు అణుగణంగా పరిశోధన పత్రాన్ని రాయగలగాలని ఉద్భోదించారు.
6. పరిశోధన పత్రల నిడివికి సంబంధించి సెమినార్ వ్యాసం, ఎం. ఫిల్., పిహెచ్. డి. గ్రంథాలలో ఉండవలసిన పుటలసంఖ్య, వాటి రచనా విధానంలో అనుసరించాల్సిన పద్ధతులను గుర్తు చేశారు.
7. పరిశోధన, సృజనాత్మకతకు ఉన్న తేడాలను తెలిపారు.
8. ప్రామాణిక గ్రంథాల అవసరం, క్షేత్ర పర్యటనల ప్రాముఖ్యం, గ్రంథాలయాల ఉపయోగాలను సూచించారు.
9. పరిశోధన పత్ర శీర్షికలు, వాటి సంక్షిప్తిని గురించి, అందులో పాటించాల్సి మెథాడాలజీల గురించి విశదీకరించారు.
10. వివిధ దేశాలలో అందుబాటులో ఉన్న పరిశోధన పద్ధతులకు సంబంధించిన పుస్తకాలను ఆకరాలుగా సూచిస్తూ, ఆ పుస్తకాల్లో ఆయ రంగాల్లో పాటించబడిన పద్ధతులను తెలిపారు.
11. అంతే కాకుండా తెలుగులో పాటించిన పరిశోధన విధానాలను తెలుపుతూ, కొన్ని ముఖ్యమైన పరిశోధన పుస్తకాలను సూచించారు.
12. తర్వాత తెలుగులో తొలి పరిశోధకుడి గురించి కూడా వివరించారు.
13. ఈ పరిశోధన రంగంలో పాటించాల్సిన మెళకులను లోతుగా తెలపుతూ, నేటి పరిశోధకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

6. తెలుగు భాష– గతం, వర్ధమానం, భవిష్యత్తు అనే అంశపై అధ్యయనం నిర్వహించిన సమావేశానికి ప్రధాన వక్తగా ప్రముఖ భాషావేత్త, హైదరాబాదు కేంద్ర విశ్వవిద్యాలయ అధ్యాపకులు డా. పమ్మి పవన్ కుమార్ గారు వ్యవహరించారు. పి. హెచ్. డి. విద్యార్థి బడిగె ఉమేష్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. డా. పవన్ కుమార్ గారి గురించి ఎం. ఫిల్. పరిశోధకుడు గుడ్ల శ్రీనివాస్ పరిచయం చేశారు.

సమావేశానికి అధ్యక్షత వహించిన ఉమేష్ సమావేశాలకు పరిశోధకులను, విద్యార్థులను అధ్యక్షులుగా ఏర్పరచి, వారిలో మాట్లాడే నైపుణ్యాన్ని పెంచుకోవడానికి కృషి చేయటం బాగుందన్నారు.

అధ్యయనం ఆరవ సమావేశ ముఖ్య ఉద్దేశాన్ని తెలుపుతూ గిడుగు, కాళోజిగార్ల జయంతిని గుర్తుంచుకొని ఈ సమావేశం నిర్వహించడం జరిగిందని, వారికి గౌరవభావంతో నివాళులు అర్పిస్తూ రెండు నిముషాలు మౌనం పాటించమని కోరారు.

ఈ సమావేశంలో హైదరాబాదు విశ్వవిద్యాలయ తెలుగు శాఖాధ్యక్షులు డా. తుమ్మల రామకృష్ణగారు మాట్లాడుతూ తన పర్యావేక్షకులైన జి. ఎన్. రెడ్డిగారు, కేతు విశ్వనాథరెడ్డిగార్లనుగురించి, తెలుగు సాహిత్యంలో భాషపై వారు నిర్వహించిన కృషినిగురించి స్మరించుకున్నారు. భాష లేకపోతే నాగరికతలు అభివృద్ధి చెందలేవని, మానవుల మధ్య మనుగడ సాగడం కష్టమవుతుందని, ప్రపంచ సుందరీకరణ సాధ్యపడదని భాష నిర్వహిస్తున్న పాత్ర అద్భుతం, అమోఘమని కూడా పేర్కొన్నారు.

తదుపరి డా. దార్ల వెంకటేశ్వరరావుగారు పవన్ కుమార్ గారి కృషిని ప్రశంశించారు.

సమావేశానికి ప్రధాన వక్త డా. పవన్ కుమార్ గారు మాట్లాడుతూ కింది విషయాలను ప్రధానంగా పేర్కొన్నారు.

బాషకు సంబంధించి వర్థమానంలోని అంశాలు కొంత బాధాకరం అయినప్పటికీ దీని మీద ఆధారపడే మనం భవిష్యత్తును నిర్మించుకోవాలి. వర్థమానం నుంచి వెనక్కి వెళ్ళడం కష్టం కాబట్టి ఈ దోవలోనే మనం ప్రయాణం ముందుకు కొనసాగించడం ఎలా? ఈ క్రమంలో మనం తీసుకోవలసిన మలుపులు ఎలా ఉంటే బాగుంటుంది? దాని మీద ఆధారపడి మనం భవిష్యత్తును నిర్మించుకొనే అవకాశం ఉన్నదా? అనే అంశాలను దృష్టిలో ఉంచుకొని ఆయన ప్రసంగం కొనసాగింది.

వేల సంవత్సరాల సుదీర్ఘమైన చరిత్ర, అనేక భాషల సాహచర్యంతో కలసి ఇది మనగలగడం, ఏ భాషను వద్దనకుండా తనలో కలుపుకొనే లక్షణం కలిగి ఉండడం ఇవన్నీ తెలుగు భాషకి ఉన్న ప్రత్యేకతలు, బలాలు. వర్థమానంలో ఇవే బలహీనతలుగా మారే ప్రమాదం కూడా కనిపిస్తుందన్నారు.

జంట నగరాల్లో ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు ఆంగ్ల మాధ్యమాలనే కోరుతున్నారు. తెలుగులో చదవాలనే వారు మూడు నుంచి నాలుగు శాతం కాగా ఆంగ్లాన్ని కోరుకొనే వారి శాతం ఇంచుమించు 96 శాతం ఉంది. అలా జరిగితే 1. మనమందరం తెలుగులో పరిశోధనలు చేస్తున్నాం. ఈ పరిశోధనలతో మనం ఏంచేయాలి? 2. సాంస్కృతిక వారసత్వం భాషల ద్వారానే ఒక యుగంనుండి వేరే యుగానికి అందించబడుతుంది. అంటే సాంస్కృతిక ప్రసరణం జరుగుతుంది. ఈ సాంస్కృతిక ప్రసరణానికి మాధ్యమమైన భాషను రక్షించుకోవాలి అని అన్నారు.

ఏ భాష అయితే లిఖిత రూపంలోను, మౌఖిక రూపంలోను ఉచ్ఛారణకు దూరంగా జరుగుతుందో అది తొందరగా అంతరిస్తుందని భాషా శాస్త్రవేత్తలు గమనించారు. దీన్నిబట్టి మనం సంక్షోభంలోకి చాలా త్వరగా వెళ్ళిపోతున్నామని తెలుసుకోవాలి. బోధనారంగంలో ఈ పరిస్థితి చాలా వేగంగా జరుగుతుంది.

గతంలో జరిగిన పరిశోధనలను చూస్తే భాషా నిర్మాణం, ప్రయోగం, భాషా వైవిధ్యం (language variation) ప్రమాణీకరణం (language standardization) భాషార్జన (language requisition)భాషాభ్యసనం, భాషా వ్యవహార వైకల్యం, వలస తెలుగు అనే అంశాల మీద పరభాషా వ్యవహారం, అంతర్భాషా వైవిధ్యం అన్న అంశం మీద అర్థ విపరిణామం, వ్యాకరణం, నిఘంటువులు తయారు చేయడం అనే అంశం మీద ఛందస్సు – అలంకారాల నిర్మాణం వాటి అధ్యయనం అనే అంశాల మీద వ్యాకరణ రచన, కవిత్వ భాషను అధ్యయనం చేయడం, శైలీ శాస్త్ర అధ్యయనం, భాషోద్యమ వికాస చరిత్ర నామవిజ్ఞానాలు, స్థల, వృక్ష సంబంధ వ్యక్తి నామాలు మొదలైన అంశాలపై పరిశోధనలు జరుగుతూ పోయాయి. శైలీ శాస్త్రం, పాశ్చాత్యులు తెలుగుకు చేసిన సేవ, పత్రికా భాష, భాషణ వ్యవహారం, లాంటి వాటి మీద జరిగాయి.తెలుగులో పాఠ్య గ్రంథాల రచన, నిఘంటువులు, భాషా శాస్త్ర బోధన భాషా పరిశోధనా రంగాలకు సంబంధించి జరిగాయి. ఇలాంటి వాటి ద్వారా మనకు జరిగే ప్రయోజనం ఏమి? వీటిని ఉపయోగంలోకి తీసుకు రావాలంటే ఏయే పద్ధతులను పాటించడం ద్వారా అలాంటివాటిని మరల్చవచ్చు అనే విషయాలను గురించి అధ్యయనాలు జరగాలి. ఆ బాధ్యత, పరిశోధకులదే. ఉన్న రంగాలనుంచి వెనక్కి వెళ్ళకుండా కొత్త దారులు వేసుకోవాలి. అంతేగానీ డిస్టింక్షన్‌లతో ప్యాసు కావడంవల్ల ఉపయోగమేమీ లేదు.

ఒక భాష మనకు సహకరించనప్పుడు ఆ సహకరించే భాష వైపు వెళ్ళడం ఒకానొక తప్పనిసరి అవసరం. దానికి నియంత్రణ లేదు. ప్రపంచీకరణ దిశగా వెళుతున్న మొత్తం ప్రపంచంలో మనకు వేరే భాష రావడం అనేది తప్పనిసరి. లేకపోతే మనం కొన్ని అవకాశాలను పొందలేము. అనువాదం ఇంకా బాగా అభివృద్ధి చెందాలి. అనువాదం లేకుండా మనం ముందుకు వెళ్ళలేము. అప్పుడు మనకు ఉపాధి అవకాశాలు బాగా పెరుగుతాయి. మనం ప్రధానంగా బోధనా రంగం మీద ఆధారపడుతున్న ఈ తరుణంలో అనువాదాలు బాగా ఉపకరిస్తాయి. ప్రపంచ వ్యాప్తంగా మనం పంచుకోవడం చేస్తున్నాం. మన భాషలను ప్రపంచానికి అనుగుణంగా సంగణీకరించుకోవాలి.

ప్రభుత్వ విధానాల వల్ల గానీ వేగంగా మారుతున్న సామాజిక ఆర్థిక పరిస్థితులవల్ల గానీ తెలుగు సులభంగా మనగలుగుతుందని చెప్పలేం. అందుకనివేరే రంగాల్లో తెలుగుకు ఉన్న బలాన్ని పరిశోధకులు గమనించగలగాలి. అలా గమనించడానికి అనువాదం ఉపయోగపడుతుంది. కనిష్టంలో కనిష్టంగా దాదాపు35 రకాల సేవలను వినియోగించుకోవచ్చు. ముఖ్యంగా స్థానికీకరించడం, translation and transcription services, websites localization, creative services మొదలైనవి.

మరొక ప్రధానాంశం మాధ్యమ రంగాలు. తెలుగు మాధ్యమాల విస్తృతి చాలా గొప్పది. హిందీ తరువాత ఎక్కువ సంఖ్యలో తెలుగు ఛానళ్ళు 60 కి పైగా ఉన్నాయి. 9 పత్రికలు, కాగితపు రూపంలోను, మరో30 పత్రికలు వెబ్సైట్స్‌లో ఉన్నాయి. మొత్తంగా 100 వ్యవస్థల్లోకి వెళ్ళడానికి కావలసిన సామర్థ్యాలు మనకు కనిపిస్తున్నాయి.

వాటిలో అనేక దశల్లో భాషలకు సంబంధించిన వనరుల అవసరం కలుగుతుంది. మనం చేయాల్సిందల్లా ఆ రంగంలోని భాషాపరమైన అవసరాలు తెలుసుకోవడమే.

సాహిత్యంవల్లనే కాకుండా ఇంకా అనేకానేక రంగాల ద్వారా భాష బ్రతుకుతుంది. భాషకు సాహిత్యం ఒకానొక నిర్మాణ వ్యవస్థ మాత్రమే. మాధ్యమరంగాల్లో నూతన అవకాశాలు ఎప్పటికప్పుడు వస్తూ ఉంటాయి. కాబట్టి అన్ని రంగాలను మనం విస్మరించకూడదు. పరిశోధనలు ఏదో ఒక కవికో రచయితకో పరిమితం కాకుండా, ఆ రచనల్లోని అంశాలనే పరిశీలించకుండా ఎప్పటికప్పుడు వాటిని అన్వయ క్రమంలోకి మార్చుకోవాల్సిన అవసరం ఉంది. మూస పద్ధతులను వదిలివేయాలి. వాటి గమనాన్ని, దారిని మార్చాలి.

తెలుగు చదువుతున్న విద్యార్థులకు కంప్యూటర్ అప్లికేషన్స్ వచ్చి ఉండాలి. టెక్స్ట్ ఉండాలి, అనువాద నైపుణ్యం కూడా ఉండాలి. ఈ మూడింటి మీద మీరు బాగా పట్టు సంపాదించగలిగితే మీకు ఉపాధికి కొదవ ఉండదన్నారు.

డా. పమ్మి పవన్ కుమార్గారు విద్యార్థులు అడిగిన అనేక ప్రశ్నలకు సమాధానాలిచ్చారు.

7.

అధ్యక్షులు రవి మాట్లాడుతూ తొలి రోజుల్లో మనం చదువుకొనే సాంఘిక శాస్త్ర సంభంధ విభాగాలన్నీ తత్వ శాస్త్రంలో భాగం. ఆ తరువాత విజ్ఞాన శాస్త్రాల అభివృద్ధి జరగడంతో అందులోని విభాగాలన్నీ వేర్వేరు శాస్త్రాలుగా విడివడ్డాయి. ఆ విధంగా ఏర్పడ్డ శాఖల్లో చరిత్ర ఒకటి. సాహిత్యం కూడా ఒక ప్రత్యేక శాఖగా ఏర్పడింది. తొలి రోజుల్లో సాహిత్యం చరిత్రల మధ్య సంబంధాన్ని గురించి, చరిత్ర సాహిత్యానికి ఏ విధంగా ఉపయోగపడిందనే విషయాలను గురించి కుర్రా జితేంద్రబాబుగారు మాట్లాడతారు.

డా. భుజంగరెడ్డిగారు జితేంద్రబాబుగారిని అభినందిస్తూ ప్రారంభోపన్యాసం చేశారు.

సామాన్యంగా అందరూ రెండు భాషలు నేర్చుకోవడానికే తల్లక్రిందులవుతారు. అలాంటిది ఆయన అష్ట భాషలను నేర్చుకోవడం సామాన్యమైన పని కాదు. దాదాపు 26000 తాళపత్ర గ్రంథాలను సేకరించారు. ఒక సంస్థ చేయలేని పనిని వారు చేస్తున్నారు. ఒక్క ఆయుర్వేద వైద్యం మీదనే దాదాపు 2000 తాళపత్ర గ్రంథాలను సేకరించారు. వారికి కృతజ్ఞతలు. వాటిలో *నవనాథ సిద్ధసారం, రసేంద్రమంగళం, భారతీయ శిక్షా స్మృతికి సంబంధించిన దండవివేకం* అనే గ్రంథం. *వ్యవహార చింతామణి* అనే న్యాయశాస్త్ర గ్రంథం, ఇలా వేర్వేరు రంగాలకు చెందిన గ్రంథాలను అచ్చు వేయడం చాలా ఆశ్చర్యపరిచే అంశం.

ప్రధాన వక్త జితేంద్రబాబుగారు మాట్లాడుతూ

ఏ రచయిత అయినా ఒక నిర్దుష్ట కాలంలో, ఒక నిర్దుష్ట సందర్భంలో నిర్దుష్టమైన భావజాలంతోనే రచనలు చేస్తాడు. వాటిని విశ్లేషిస్తే చరిత్ర, సాహిత్యాలు దొరుకుతాయి.

రాజకీయాలు లేకుండా చరిత్ర సాహిత్యాలు మనగలగలేవు. తెలంగాణా ప్రాంత సాహిత్యాన్నే చూసుకుంటే 2000 సంవత్సరాలుగా మనకు అర్థమవుతుంది.

చరిత్ర అంటే మనం గతంలో చేసే ప్రయాణం. దానిలో సంప్రదాయాలు, పద్యాలు, సాహిత్యం, మానవ పరిణామం, భావపరిణామం మొదలైనవన్నీ అంతర్భాగంగా ఉంటాయి.

సాహిత్యం అంటే మానవ సంస్కృతితో కూడిన ఒక జీవన విధానం. అందులో పండుగలు, పాటలు, ఉత్సవాలు సంతోషాలు మొదలైనవి అంతర్భాగం. వీటన్నింటికీ సంబంధించిన సమాహారాన్ని కలిపి మనం సంస్కృతి అంటున్నాం.

ఆయా ప్రాంతాలలో ప్రత్యేకమైన సాహిత్యం ఉంది. తెలుగు మూలాలన్నీ కూడా మనకు సంస్కృతంలోను, ప్రాకృతంలోను కనిపిస్తాయి. శాసనాలన్నీ దాదాపుగా సంస్కృతంలోనే ఉండడంవల్ల మనం దాన్ని ప్రాచీన భాషగా పరిగణిస్తున్నాం.

హేమాద్రి అనే వాడు *దేశీ నామ మాల అనే ఒక నిఘంటువును తయారు చేశాడు. దానిలో ఎన్ని తెలుగు పదాలు ప్రాకృతం నుంచి తెలుగులోకి వచ్చాయో తెలుస్తుంది. మనకు గాథా సప్తశతి నాటికే ప్రాకృతంలో మనం పాడుకొనే పాటలకు సంబంధించిన సాహిత్యం మనకు లభ్యం కాకుండా పోయింది.*

శాతవాహనుల తరువాత ఇక్ష్వాకులు నాగార్జున కొండలో 76 శాసనాలు చెక్కారు. అందులో 74 ప్రాకృత శాసనాలు. రెండు సగం ప్రాకృతం, సగం సంస్కృతం. 3 ,4 శతాబ్దాలలో ప్రాకృతం తరువాత సంస్కృతం ఇక్కడికి వచ్చింది.

దిఙ్నాగుడు కరీంనగర్ దగ్గర పెద్ద పల్లికి సమీపంలో ఉన్న మునుల గుట్టలో ఉన్నాడు. అతడు బౌద్ధ తాత్వికుడు. కాళిదాసుకు సమకాలికుడు. కాళిదాసు ప్రాంతం కూడా వివాదంలో ఉంది. అతడు కరీంనగర్ దగ్గర ఉన్న రామగిరివాడని కొందరు అభిప్రాయపడుతున్నారు. అందువల్ల దిఙ్నాగుణ్ణి ప్రత్యక్ష్యంగా చూశాడు. మనకు తెలియని విషయమేంటంటే కాళిదాసు దిఙ్నాగుడి రచనలను కాపీ కొట్టాడు. దిఙ్నాగుడి *కుందమాల అనే సంస్కృత నాటకం నుండి రఘువంశంలోకి కొన్ని శ్లోకాలను యథాతథంగా తీసుకున్నాడు.*

కాళిదాసు, బాసుని నాటకాలలో 70 శాతం ప్రాకృతం, 30 శాతం సంస్కృతం ఉంది. 8వ శతాబ్దంలో వచ్చిన *మృచ్ఛకటికం*

నాటకంలో కూడా 12 పాత్రలు ప్రాంతీయ ప్రాకృత మాండలికాన్ని, 4 పాత్రలు సంస్కృతాన్ని మాట్లాడాయి.

అంటే ఈ ప్రాంతపు భాష, సాహిత్యం నేటి భారతీయ సాహిత్యాన్ని ప్రభావితం చేస్తుంది.

ఐన్స్టీన్ దిఙ్నాగుడి ప్రమాణ సముచ్చయం అనే గ్రంథాన్ని చదివి e= mc squire theoryని, నాగార్జునుడి *శూన్యతా సప్తశతి అనే గ్రంథంలో మనస్సులోని ఆలోచనలను తీసివేస్తూ పోతే ఒక శూన్య స్థితి వస్తుందని, తద్వారా ఒక అజేయమైన శక్తి వస్తుందని ప్రతిపాదించాడు. ఆ గ్రంథాన్ని చదివి ఆ సిద్ధాంతాన్ని నీల్స్బోర్ పదార్థానికి అనువర్తించి అణుబాంబు తయారు చేశాడు.*

ఇలాంటి ఎన్నో అమూల్యమైన విషయాలను జితేంద్రబాబుగారు తెలియజేశారు.

ఆర్థికం

అధ్యయనం ఈ సంవత్సర కాలంలో సేకరించిన, ఖర్చుచేసిన డబ్బుల విషయంలో ప్రజాస్వామికంగా ఉండాలని భావించి, ఇప్పటి వరకు విద్యార్థి మిత్రులనుంచి సేకరించిన డబ్బులు=7000. అక్షరాల ఏడు వేల రూపాయాలు

ఖర్చయిన డబ్బులు= 9010

లోటు బడ్జెట్= 2010